క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ


బి.వెంకటరామయ్య

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ సబ్‌ డివిజన్‌ డీఎస్పీగా బి.వెంకట రామయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో తాను పత్తికొండలో సీఐగా పనిచేశానని, తిరిగి ఇదే ప్రాంతానికి డీఎస్పీగా రావడం సంతోషంగా ఉందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

రోడ్డుకు మరమ్మతులు


దౌల్తాపురం - చిప్పగిరి మధ్య తెగిన రోడ్డుకు మరమ్మతు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

చిప్పగిరి: గత వారంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మండంలోని దౌల్తాపురం- చిప్పగిరి రోడ్డు తెగిపోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అయినా అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో ఇటీవల సాక్షి దినపత్రికలో 'మరమ్మతులూ కరువాయే' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన అధికారులు శనివారం రోడ్డు మరమ్మతు చేసి సమస్య పరిష్కరించారు. దీంతో రెండు గ్రామాల ప్రజల ప్రయాణానికి ఇక్కట్లు తప్పడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

వంతెన పనులు వెంటనే పూర్తి చేయాలి


దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తూ అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

హాలహర్వి: చింతకుంట-బళ్లారి హైవే బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి సూచించారు. శనివారం చింతకుంట గ్రామంలో హగిరి-బళ్లారికి వెళ్లే దారిలో కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. జాతీయ రహదారి పనులు ప్రారంభించి వాహనదారులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మల్లికార్జునపల్లెలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. తహసీల్దార్‌ నజ్మాబాను, డిప్యూటీ తహసీల్దార్‌ లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మద్దికెర : శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్థానిక బెస్త, మద్ది వీధి కూడలిలోనున్న ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

హొళగుంద: మండల కేంద్రం శివారులోని తెల్లకొండ వద్ద వెలిసిన అగ్రహార ఆంజనేయ స్వామికి శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు కాలినడకన తరలివచ్చారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయ ఆవరణలో వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన ఉత్సవ విగ్రహాలను చేయించి కల్యాణ కార్యక్రమం చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. కల్యాణం సందర్భంగా దేవాలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

హొళగుంద: విద్యార్థులు పట్టుదలతో చదవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రవీణ సూచించారు. శనివారం కళాశాలలో సెకండియర్‌ విద్యార్థులు ఫస్ట్‌ ఇయర్‌ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం (ఫ్రెషర్స్‌ డే) నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకొని, ఆత్మవిశ్వాసం, మనోధైర్యంతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పెద్దాపుర ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ శంకరప్రసాద్‌ పాల్గొన్నారు.

పంట నమోదుతో ప్రయోజనాలు

కృష్ణగిరి: సాగు చేసిన పంటలను నమోదు చేయించుకుంటే ప్రభుత్వం నుంచి పలు రకాల ప్రయోజనాలు పొందవచ్చని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. పలు గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం

చిప్పగిరి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని నేమకల్లు గ్రామంలో నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షిని శనివారం కమిటీ సభ్యులు రవితేజ,కృష్ణమూర్తి ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. వేడుకలు సోమవారం ప్రారంభమై మంగళవారం ఊరేగింపుతో ముగుస్తాయని చెప్పారు. వేణు,కృష్ణ మూర్తి,దోనెప్ప,రాము పాల్గొన్నారు.

ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి



కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన ఘటన తీవ్రంగా కలచి వేసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే మహిళా వైద్యులు, సిబ్బందికి పటిష్ట భద్రత కల్పించాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాల నిఘా ఉండాలి. మహిళా డాక్టర్లు, సిబ్బందిలో ఆత్మ విశ్వాసం పెరగాలంటే సమాజం నుంచి మద్దతు అవసరం.
– డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌, వైద్యాధికారి, తుగ్గలి పీహెచ్‌సీ



భద్రత పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో లేడీ డాక్టర్లు ఉన్న వార్డుల దగ్గర భద్రత పెంచాలి. వార్డులో సంఘటన జరిగితే వెంటనే స్పందించేలా అధికారులు సీసీ ఫుటేజీలను పర్యవేక్షిస్తుండాలి. రోగిని కాపాడేందుకు డాక్టర్లు అవిశ్రాంతంగా కృషి చేస్తారు. క్యాజువాల్టీ, ఐసీయూ, ఏఎంసీ వార్డుల దగ్గర రోగుల బంధువులు సంయమనం పాటించి డాక్టర్లకు సహకరించాలి. మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రాత్రి వేళల్లో స్థానిక పోలీసులు పర్యవేక్షించాలి. అభద్రతా భావం తొలగితే ధైర్యంగా పనిచేయగలం.
– డాక్టర్‌ బాలకృష్ణారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆస్పరి

ప్రతిభావంతులకు ఉపకారం

- ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్షకు నోటిఫికేషన్‌ విడుదల
- సెప్టెంబర్‌ 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఆదర్శంగా నిలుస్తున్న ఆలూరు మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో ఎక్కువ శాతం మంది అభ్యాసకుల ఎంపిక


ఆలూరు మోడల్‌ పాఠశాలలో ఉపకారవేతనం పొందుతున్న విద్యార్థులు

ఆలూరు: గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను ప్రోత్సహించాలని, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సెకండరీస్థాయిలో వారి విద్యకు ఆటంకం లేకుండా కొనసాగించేందుకు కేంద్రప్రభుత్వం ఉపకార వేతనాలను అందిస్తుంది. ఇందుకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్‌ మీన్స్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌ (ఎన్‌ఎంఎంఎస్‌) పేరుతో ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ఉపకార వేతనాలు అందిస్తుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ పరీక్షలో ఆలూరు మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు అధికంగా ఉత్తీర్ణులై స్కాలర్‌షిప్‌ పొందుతున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 118 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌ పొందుతున్నారు. ఈ ఏడాది ఎన్‌ఎంఎంఎస్‌ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల 6వ తేదీ వరకు గడువుంది. ఎంహెచ్‌ఆర్‌డీ ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే ఈ పరీక్షలో ఒక్కసారి అర్హత సాధిస్తే 9వ, తరగతి నుంచి ఇంటర్‌మీడియెట్‌ వరకు ఏడాదికి రూ.12వేలను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలోకి డీబీటీ ద్వారా చెల్లిస్తారు.

అర్హులు వీరే..

- విద్యార్థి 7వ తరగతిలో 55 శాతం మార్కులను సాధించి ఉండాలి.
- 8వ తరగతిలో కూడా ఎంపిక నాటికి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎస్సీ,ఎస్టీ దివ్యాంగులైతే 50 శాతం మార్కులుంటే చాలు.
- ప్రభుత్వ, మున్సిపాలిటీ, జెడ్పీ, ఎయిడెడ్‌ పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- విద్యార్థుల తల్లిదండ్రుల కుటుంబ వార్షిక ఆదాయం ఏటా రూ.3.50 లక్షలకు మించరాదు.
- రాత పరీక్ష ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- ఓసీ జనరల్‌, బీసీ, పీహెచ్‌ విద్యార్థులకు 40 శాతం కనీసం 36 మార్కులు సాధించాలి.
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 32 శాతం 29 మార్కులు సాధించినా అర్హత సాధించినట్లు పరిగణిస్తారు.

పరీక్ష విధానం..

మెంటల్‌ ఎబిలిటీ టెస్ట్‌ (మ్యాట్‌)

- 90 మల్టీపుల్‌ చాయిస్‌ ప్రశ్నలుంటాయి. ఇందులో ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు. మొత్తం 90 మార్కులకు కేటాయిస్తారు. మైనస్‌ మార్కులు ఉండవు.

స్కాలాస్టిక్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌ (శాట్‌)

ఇందులో 90 మల్టిపుల్‌ ఛాయిస్‌ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 90 మార్కులకు 7,9వ, తరగతుల స్థాయిలో సైన్స్‌ ,సోషియల్‌ మాథ్స్‌ పాఠ్యాంశాలకు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్‌ మార్కులు ఉండవు. ఫిజిక్స్‌లో 12 మార్కులు, కెమిస్ట్రీలో 11, బయాలజీలో 12, మాథ్స్‌లో 20, హిస్టరీలో 10 జియాగ్రఫీలో 10, పొలిటికల్‌ సైన్స్‌లో 10, ఎకనామిక్స్‌లో 5 మార్కులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తు ఇలా ..

www.bre.ap.gov.in విద్యాశాఖ సెంకడరీ ఎడ్యుకేషన్‌ బోర్డు వెబ్‌ ద్వారా ఆన్‌లైన్లో విద్యార్థులు దరఖాస్తులను జిల్లా ప్రభుత్వ పరీక్షల సంచాలకులకు సబ్‌మిట్‌ చేయాలి. పరీక్షకు హాజరయ్యే ఇతర కులాలకు చెందిన విద్యార్థులు రూ.100, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు ఫీజులో 50 శాతం మినహాయింపుతో ఎస్‌బీఐలో చలానా రూపంలో చెల్లించాలి. సెప్టెంబర్‌ 10వ తేదీలోగా ఫీజులు చెల్లిండంతోపాటు ఆదే తేదిలోగా పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) హెచ్‌ఎంల ద్వారా అందజేయాలి. అలాగే..విద్యార్థుల దరఖాస్తులను అదే నెల 15వ తేదీన అన్ని అప్రూవల్‌ పూర్తి చేసిన దరఖాస్తులను అన్ని విధాలుగా అర్హతలు ఉన్న విద్యార్థులకు డిశంబర్‌ 8న ఆఫ్‌లైన్‌ ద్వారా పరీక్షలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు చక్కటి అవకాశం

పేద,మధ్య తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే మెరిట్‌ స్కాలర్‌ షిప్‌ ఎంతో ఉపయోగకరం. అయితే ఈ పరీక్షలో ఒక్కసారి అర్హత సాధిస్తే చదువులకు తల్లిదండ్రులపై భారం తగ్గుతుంది. స్కాలర్‌షిప్‌నకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు సూచనలిచ్చాం.
– వెంకటరమణారెడ్డి డిప్యూటీ ఈఓ, ఆదోని

ఇంట్లో డబ్బులు అడగను



స్కాలర్‌షిప్‌ వస్తుండటంతో విద్యకు అవసరమైన ఖర్చులకు ఇంట్లో అమ్మ నాన్నలను డబ్బులు అడగటం లేదు. నెలకు రూ వెయ్యి ప్రకారంగా ఏడాదికి రూ.12 వేలు మంజూరవుతుంది. వాటితో పుస్తకాలు, బట్టలు తదితర ఖర్చులకు వినియోగించుకుంటున్నా.
– హిస్మత, పదవ తరగతి,ఆలూరు మోడల్‌ స్కూల్‌

మూడేళ్లు నుంచి స్కాలర్‌షిప్‌ పొందుతున్నా



8వ, తరగతి నుంచి మెరిట్‌ స్కాలర్‌ షిప్‌ అందుతుంది. ఈ ఏడాదితో ఇంటర్‌ రెండో సంవత్సరం పూర్తవుతుంది. ఏటా రూ.12 వేలు పొందాను. ఇలాంటి ఉపకార వేతనాలు మాలాంటి పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం.
– కె.యూసుఫ్‌ ఇంటర్‌ విద్యార్థి

విద్యార్థులతో దరఖాస్తు చేయిస్తాం

ఇప్పటికే బాగా చదివే విద్యార్థుల దరఖాస్తులను ఎన్‌ఎంఎంఎస్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌కు వివరాలను సేకరిస్తున్నాం. చాలామంది పేద విద్యార్థులకు పరీక్షలో మార్కులు సాధించే అంశంపై కొన్ని మెలుకువలను సూచిస్తున్నాం. ఇందుకు ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇస్తున్నాం. తల్లిదండ్రుల వివరాలు, ఏడాది వార్షిక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాలని చెప్పాం.
– రాఘవరావు, ఏపీ మోడల్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌, ఆలూరు

కౌలు వసూలులో పక్షపాతం తగదు

చిప్పగిరి: స్థానిక భోగేశ్వర,చెన్నకేశవ స్వామి తదితర ఆలయాల మాన్యం కౌలు సొమ్ము వసూలులో దేవదాయశాఖ అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు బుసినే శ్రీరాములు, హనుమంతు విమర్శించారు. వేలంలో మాన్యం భూములు దక్కించుకున్న టీడీపీ మద్దతుదారుల నుంచి నిర్దేశించిన సొమ్ము ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది జూన్‌ 19న ఆలయాల భూములకు వేలాలు నిర్వహించగా, 14 మంది రైతులు భూములు దక్కించుకున్నారన్నారు. భూములు దక్కించుకున్న వారికి మూడేళ్ల పాటు పంటలు సాగుచేసుకునే హక్కు ఉంటుంది. ఇందుకు ఏటా ఖరీఫ్‌ ప్రారంభంలోనే వేలం సొమ్ము చెల్లించాలని నిబంధన విధించారు. అయితే భూములు దక్కించుకున్న టీడీపీ నాయకులు ఇప్పటి వరకు వేలం సొమ్ము చెల్లించలేదని ఇలా.. రూ.2,20,000 బకాయి పడ్డారని చెప్పారు. ఇప్పటికైనా వారి నుంచి ఆ సొమ్ము వసూలు చేయాలని డిమాండ్‌ చేశారు. రామాంజనేయులు,పెద్దన్న,రాముడు,కురువ పెద్దన్న,కురువ రామచంద్ర, మధు పాల్గొన్నారు.

ఆలూరులో పార్టీ ఓటమి చెందడం బాధాకరం

కర్నూలు(టౌన్‌): ఆలూరు నియోజకవర్గంలో పార్టీ ఓటమి చెందడం బాధాకరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌, 6 మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్‌ ఇన్‌చార్జ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి గెలుపునకు అందరూ పనిచేశారని, కొన్ని కారణాలతో స్వల్ప తేడాతో ఓటమి చెందారని చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌, అభ్యర్థి వీరభద్రగౌడ్‌ మాట్లాడుతూ చివరి నిమిషంలో సీటు ఖరారవడంతో అధిక శాతం ప్రజలను కలుసుకోలేక పోవడంతో ఓటమి చెందానన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాసు

పత్తికొండ(తుగ్గలి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే చేసి రైతులు నష్టపోకుండా న్యాయం జరిగేలా చూడాలని ఎంపీపీ నారాయణ దాసు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను లేవనెత్తారు. పంట కాలువలు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా తీర్మాణం చేయాలని, వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని దూదేకొండ, కోతిరాల్ల ఎంపీటీసీ సభ్యులు ఈరన్న, కృష్ణారెడ్డి కోరారు. ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు కరెంటు బిల్లులు అధికంగా వస్తున్నాయని హోసూరు ఎంపీటీసీ సభ్యుడు నెట్టికల్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పశువుల షెడ్ల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ మంజూరయ్యేలా చూడాలని చిన్నహుల్తి సర్పంచ్‌ కేశవరెడ్డి కోరారు. స్థలం చూపించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఇంత వరకు నూతన అంగన్‌వాడీ భవనం మంజూరు కాలేదని పెద్దహుల్తి సర్పంచ్‌ విజయలక్ష్మి వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో 486 హెక్టార్లలో పత్తి, కంది, సజ్జ, వేరుశనగ తదితర పంటలు, 150 హెక్టార్లలో ఉల్లి, మిరప నష్టపోయినట్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైస్‌ ఎంపీపీలు బలరాముడు, రంగమ్మ, మండల కో ఆప్షన్‌ సభ్యుడు నజీర్‌, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి పల్లకీ సేవ


దొనలో స్వామి వారి పాదాలకు పూజలు చేస్తున్న అర్చకులు

మద్దికెర : మండలంలోని పెరవలిలో వెలసిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు శ్రావణ మసం మూడవ శనివారాన్ని పురస్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూలవిరాట్‌, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఉదయం బిందెసేవ, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను సతీసమేతంగా పల్లకీలో కొలువుంచి వేదమంత్రాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి వారు భూమి మీద పాదం మోపిన స్థలం అయిన దొనకు ఊరేగింపుగా వేళ్లి పాదపూజ జరిపించారు. పారా రామన్న సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈఓ చంద్రశేఖర్‌ రెడ్డి, దాతలు పారా రామచంద్రప్రసాద్‌, పారా విశ్వనాథ్‌, అర్చకులు రంగస్వామి పాల్గొన్నారు.

దేవనకొండకు చేరిన పురాతన విగ్రహాలు


దేవనకొండ చేరిన పురాతన విగ్రహాలు

దేవనకొండ: దాదాపు నాలుగు శతాబ్దాల క్రితం నాటి పురాతనమైన విగ్రహాలు శనివారం స్థానిక శ్రీలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయం చేరాయి. గ్రామస్తుల కథనం మేరకు.. దాదాపు నాలుగు తరాల క్రితం దేవనకొండలోని కొందరు కొండపై భాగంలో సింగరిగేరి, మదనంతపురం అని కాలనీలు ఏర్పాటు చేసుకొని ప్రజలు జీవనం సాగిస్తుండేవారు. అక్కడ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించుకుని పూజలు చేసేవారు. కాలక్రమేనా కొండమీది ప్రజలు దిగువ ప్రాంతానికి వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. జనం లేకపోవడంతో అక్కడి ఆలయం శిథిలావస్థకు చేరుకుందని, పూజలకు దూరమైన దేవతామూర్తులను ఆలయ పూజరులు తమ ఇంట్లో ఉంచుకొని పూజించసాగారు. అయితే ఆ పూజారులు కూడా ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వలస వెళ్లారు. వారితోపాటే ఆ విగ్రహాలను కూడా తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రవాసులు విగ్రహాలు అప్పగించాలని పూజారులను కోరగా వారు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా విగ్రహాలను మేళతాళాల నడుమ మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టి పునః ప్రతిష్ఠించారు.

జగనన్నను దూషించడం తగదు

ఆలూరు: మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడం రాష్ట్ర హోంశాఖ మంత్రికి తగదని, నోటి దురుసుతోనే అలాంటి వ్యాఖ్యలు చేస్తుందని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి, అంతకు ముందు ఐదేళ్ల పాటు ప్రతిపక్ష నాయకుడిగా, ఎంపీగా పనిచేసిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత ఆమెకు లేదన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించకుండా ప్రతిపక్ష నేతలను దూషించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇలాంటి చౌకబారు మాటలను మానుకోవాలని హితవు పలికారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మద్దికెర : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ గోపాల్‌ సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్‌ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వంటవారు తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తుండాలని చెప్పారు.

ఆలూరు రూరల్‌: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఆలూరు తహసీల్దార్‌ గోవింద్‌ సింగ్‌ సూచించారు. పట్టణంలోని హత్తిబెళగల్‌ రోడ్డులోనున్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే భోజన నాణ్యతను పరిశీలించి, రుచి చూశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌ జమ్మన్నను ఆదేశించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయడం లేదని ప్రిన్సిపాల్‌ తహసీల్దార్‌ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌ఐ బసవన్న గౌడ్‌, వీఆర్వో మహేంద్ర ఉన్నారు.

అభిప్రాయాలు సేకరించండి


మాట్లాడుతున్న డీసీఓ శ్రీదేవి

ఆలూరు: అరికెర గ్రామ అంబేడ్కర్‌ గురుకుల బాలుర పాఠశాలలోని జూనియర్‌ కళాశాల విద్యార్థులను వేరే పాఠశాలలకు తరలించే విషయంపై తల్లిదండ్రుల అభిప్రాయాన్ని సేకరించి నివేదిక పంపాలని డీసీఓ శ్రీదేవి ప్రిన్సిపాల్‌ టి. శ్రీనివాసరెడ్డికి సూచించారు. శనివారం ఆమె పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం ఆహారం వడ్డిస్తున్నారా? ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి ఇంటర్‌లో సైన్స్‌ గ్రూపులను ప్రారంభించాలని ఉన్నత విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపులు నిర్వహిస్తున్నామని, తక్కువ సంఖ్యలో విద్యార్థులు చేరడంతో వారిని జిల్లాలోని ఏదేని గురుకుల బాలర పాఠశాలలో చేరిస్తామని చెప్పారు. ఇందుకు తల్లిదండ్రుల అనుమతి అవసరమన్నారు. ఉపాధ్యాయులు నరసింహులు, సుధాకర్‌రాజు,లక్ష్మన్న,మనోజ్‌రాజు, ప్రదీప్‌కుమార్‌ పాల్గొన్నారు.

నేడు టెంకాయల విక్రయానికి వేలం

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి దసారా బన్ని ఉత్సవాలకు సంబంధించి ఆదివారం టెంకాయ వేలం నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. వీరభద్రగౌడ్‌ ఆధ్వర్యంలో జరిగే వేలం పాటల్లో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్‌ చెల్లించాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు ఉత్సవాలు ముగిసేంత వరకు టెంకాయలు అమ్ముకోవచ్చని చెప్పారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

ఆలూరు రూరల్‌: మండలంలోని ఆలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆలూరు ఎస్‌ఐ నరసింహులు ఆలయ కమిటీ నిర్వాహకులకు సూచించారు. శనివారం మండలంలోని గిడ్డ హనుమంతు ఆలయంలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఇటీవల ఆలయాల్లో దొంగలు చొరబడి హుండీ నగదు, గంటలు దొంగలిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వరుణ యాగం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో వర్షం కోసం శనివారం వరుణ యాగ పూజలు నిర్వహించారు. వేదపండితులు నటరాజ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయంలో లక్ష్మీ నరసింహ స్వామి తిరుమంజనం, రుద్ర, నవగ్రహ హోమాలు, బలిహరణం, పూర్ణాహుతి, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు ఆంజనేయస్వామి, లక్ష్మీనరసంహ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.

వైభవంగా రథోత్సవం

హాలహర్వి: శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా మండలంలోని క్షేత్రగుడి ఆంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సీతారామస్వామి, కోదండస్వామి, ప్రహ్లాదస్వామి, రాజస్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు చేపట్టారు. ఆంధ్ర,కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తుల మధ్య రథోత్సవం జరిపించారు.

నదీ జలాలతో అభిషేకం


తుంగభద్ర నీటిని తీసుకొస్తున్న బిణిగేరి గ్రామ యువకులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామస్తులు శనివారం మంత్రాలయం వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నది నీటిని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ నీటితో గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామిని అభిషేకించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని ఏటా ఇలా నది నీటిని తెచ్చి స్వామివారికి జలాభిషేకం చేయడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు. ఈ ఏడాది వంద మందికి పైగా యువకులు పాదయాత్ర ద్వారా మంత్రాలయం చేరకుని అక్కడ తుంగభద్రకు ప్రత్యేక పూజలు చేసి నీటితో గ్రామానికి చేరుకోగా నదీ జలాలకు పూజలు చేసి వారికి ఘన స్వాగతం పలికారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి


వెల్దుర్తి ఎస్సీ హాస్టల్‌ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్‌ చంద్రశేఖర్‌వర్మ

వెల్దుర్తి: వసతిగృహాల్లో ఉండే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని తహసీల్దార్‌ చంద్రశేఖర్‌వర్మ సూచించారు. స్థానిక ఎస్సీ హాస్టల్‌ను శనివారం తనిఖీచేసి రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు వసతిగృహాన్ని పరిశీలించామన్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. వసతిగృహ పరిసరాలు, భోజనశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆర్‌ఐ మస్తాన్‌, వార్డెన్‌ ఉస్మాన్‌ ఉన్నారు. అలాగే.. కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌ను తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ తనిఖీ చేశారు. హాస్టల్‌ భవనం శిథిలావస్థకు చేరిందని విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని వార్డెన్‌ వెంకటేశ్వర్లుకు సూచించారు.